క్లుప్తంగా

మంత్రిని కలిసిన ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు

నల్లగొండ టౌన్: ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియామకం అయిన వడ్డె బోయిన సైదులు శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డిని కలిసి తన నియామకానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

వృద్ధురాలికి అంత్యక్రియలు

నల్లగొండ టూటౌన్: తనకంటూ ఎవరూ లేని వృద్ధ మహిళ గిట్ట తారకమ్మ(90) అనారోగ్యంతో గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. నల్లగొండలోని పాతబస్తీ 28వ వార్డులో 50 సంవత్సరాలుగా ఆమె నివాసం ఉంటోందని స్థానికులు తెలిపారు. బంధువులు, కుటుంబ సభ్యులు ఎవరూ లేని ఆమె.. 50 ఏళ్ల నుంచి రిక్షాలు కిరాయికి ఇచ్చి జీవించేదని పేర్కొన్నారు. స్థానిక కౌన్సిలర్ శ్రీనివాస్‌యాదవ్, కార్మికులతో కలిసి శుక్రవారం తారకమ్మకు అంత్యక్రియలు నిర్వహించారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల: మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన జోగు ఎల్లేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడితో కలిసి చిట్యాలలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుకున్న 2004–05 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఎల్లేష్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. వారు సేకరించిన రూ.57,000 లను శుక్రవారం ఎల్లేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సాగర్ల మహేష్, జిట్ట నరేష్, బీంపాక గిరిబాబు, గడ్డం గోవర్ధన్, కడారి వెంకన్న, కిషన్, విజయ్‌కుమార్, శ్రీశైలం, అర్జున్, బాలరాజు, శేఖర్, ఊషిరాం, శేఖర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం: మండలంలోని రామగిరికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, టీటీయూసీ(తెలంగాణ ట్రేడ్ యూనియన్ సెల్) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చామల వెంకటరమణారెడ్డి శుక్రవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గూని వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు చామల సంపత్‌కుమార్‌రెడ్డి, నిమ్మల కృష్ణమూర్తి, మొగుళ్ళ శ్రీను, పరమేశ్, ఆకుల శ్రీను, యాదయ్య, నిమ్మల మధు, లోడంగి మహేశ్, సైదులు, వేముల నాగరాజు, మాద నర్సింహ, కప్పల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు ఆర్థిక చేయూత



చెక్కు అందజేస్తున్న విశ్వనాథం

నల్లగొండ రూరల్ : సూర్యాపేట జిల్లా యర్కారం గ్రామ పరిధిలోని దుబ్బ తండాలో రైతు ధరావత్ నర్సింహ సాగుచేసి ఐదెకరాల వరి చేను నీరు లేక ఎండిపోయింది. రైతు కన్నీటి వేదన సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ కావడంతో రాయల్ ఈవీ కంపెనీ ఫౌండర్ విశ్వనాథం స్పందించి శుక్రవారం రైతు ధరావత్ నర్సింహకు రూ.30 వేల విలువ గల చెక్కును నల్లగొండలో అందజేశారు. కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, షోరూం యజమాని జయకృష్ణ, అయితగోని రమేష్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, చెన్నగోని నగేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక



పూజర్ల శంభయ్య, అధ్యక్షుడు



మంగ సైదులు, జనరల్ సెక్రటరీ

నకిరేకల్: నకిరేకల్ న్యాయవాదుల సంఘం (బార్ అసోసియేషన్) ఎన్నికలు శుక్రవారం జరిగాయి. సీనియర్ న్యాయవాది పోతుల మల్లయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పూజర్ల శంభయ్య, ఉపాధ్యక్షులుగా నోముల మనోహర్, జనరల్ సెక్రటరీగా మంగ సైదులు, జాయింట్ సెక్రటరీగా నూకల మల్లేష్, ట్రెజరర్‌గా బొబ్బలి నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు.

'జర్నలిస్టుల డిమాండ్స్‌డే'ను విజయవంతం చేయండి

నల్లగొండ టౌన్ : నల్లగొండలో శనివారం నిర్వహించనున్న జర్నలిస్టుల డిమాండ్ డేను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని, మీడియా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ ఆందోళన కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు ఆందోళన కార్యక్రమంలో పాల్గొని రాజకీయ పార్టీల బాధ్యులకు వినతి పత్రాలు ఇచ్చి నిరసన తెలపాలని కోరారు.

శునకాలు, కోతుల స్వైరవిహారం

- గత రెండు రోజుల్లో 30 మంది బాధితులు
- బెంబేలెత్తుతున్న నకిరేకల్ పట్టణ ప్రజలు
- నివారణ చర్యలు తీసుకోవాలని వేడుకోలు



నకిరేకల్‌లోని ఓ వీధిలో సంచరిస్తున్న కుక్కలు



కుక్క కాటుకు గురై ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

నకిరేకల్: పట్టణంలో ఒకవైపు కుక్కలు, మరోవైపు కోతులు, పందుల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. చిన్నారులు, మహిళలు చేతిలో కవర్ పట్టుకుని బయటకు వెళితే వెంటపడి దాడి చేస్తున్నాయి. గత గురు, శుక్రవారాల్లో నకిరేకల్ పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో కలుపుకుని 30 మందికి పైనే కోతులు, కుక్కకాటుకు గురయ్యారు.

2500 పైనే కుక్కలు ఉన్నట్లు అంచనా

నకిరేకల్ పట్టణంలో 40 వేల పైచిలుకు జనాభా ఉన్నారు. రోజురోజుకూ విస్తరిస్తున్న నకిరేకల్ పట్టణంలో కోతులు, కుక్కలు, పందుల బెడదతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్ల మధ్య ఖాళీ ప్లాట్‌ల్లో పందులు ఆవాసాలను ఏర్పాటు చేసుకుని అపరిశుభ్రం చేస్తున్నాయి. నకిరేకల్ మున్సిపాలిటీ కేంద్రంలో 2500 పైనే కుక్కలు ఉన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వీధుల్లో వెళ్లే వారిని, ద్విచక్ర వాహనాదారులను కుక్కలు వెంట పడి కింద పడేసి గాయపరుస్తున్నాయి. గత ఏడాది కాలంగా 150 మంది పైనే కుక్క కాటుకు గురయ్యారు. గడిచిన రెండు రోజుల్లోనే 30 మందిపైనే కుక్క కాటుకు గురై నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు.

పెంకులను పగులగొడుతున్న కోతులు

నకిరేకల్‌లో కోతులు సంచరిస్తూ రాత్రనక, పగలనక భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఇళ్ల కప్పులపై ఎగురుతూ పెంకులను పగులగొడుతున్నాయి. ఇళ్లలోకి ప్రవేశించి పిల్లల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వంట పాత్రలు, తినే పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. పిల్లల్ని, మహిళల్ని గాయపరుస్తున్నాయి. కోతులకు భయపడి ఇళ్ల వద్ద మహిళలు ఒంటరిగా ఉండాలంటే భయపడుతున్నారు. కోతులు పెంకులను పగులగొట్టడం, ఊడదీయడం వల్ల కురవని పెంకుటిల్లు ఒక్కటికూడా లేకుండా పోయింది. ఇంటిపై ఉన్న కేబుల్ వైర్లు కూడా తెంపేస్తున్నాయి. ఆర్థిక స్థోమత కలవారు పెంకులు తీసి రేకుల కప్పు వేసుకుంటున్నారు. తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయలు విక్రయించే చిరు వ్యాపారుల పరిస్థితి దారుణంగా ఉంది. వీటి నివారణ కోసం మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఏరియా ఆస్పత్రి బాటపడుతున్న బాధితులు

గడిచిన రెండు రోజుల్లో కోతులు, కుక్కల బారిన పడి పలువురు నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి బాట పడుతున్నారు. గురువారం 12 మంది కోతుల బారినపడి గాయాలపాలు కాగా, శుక్రవారం 18 మంది కుక్కకాటుకు గురయ్యారు. నకిరేకల్ మండలంలోని చందంపల్లి, కడపర్తి, గోరెంకలపల్లి, మర్రూరు గ్రామాల్లో పలువురు కుక్క కాటుకు గురయ్యారు. ఇక నకిరేకల్ మున్సిపాలిటిలోని మూసీ రోడ్డు వెంట ఏఎంఎం, గౌతం స్కూల్ సమీపంలో బడి పిల్లలు మధ్యాహ్నం పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా కుక్కల గుంపులుగా వెంటపడి గాయపరుస్తున్నాయి.

బడికి వెళ్లి వస్తుండగా కుక్క కాటుకు గురైన విద్యార్థి



కుక్క కాటుకు గురైన విద్యార్థి

ఈ ఫొటోలో కనిపిస్తు బాలుడు చెనగాని సాయిఈశ్వర్. చెనగాని మార్కెండయ్య కుమారుడు. వీరు మూసీ రోడ్డులో ఉంటున్నారు. సాయి ఈశ్వర్ గౌతం స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం పాఠశాల నుంచి ఇంటికి వస్తుండగా కుక్క వెంట పడి కరిచింది. దీంతో స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతడు ఒక్కడే కాదు. ప్రతిరోజు చాలామంది కుక్కలు, కోతుల బారినపడి గాయాల పాలై నకిరేకల్ ఏరియా ఆస్పత్రి బాట పడుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



నకిరేకల్ పట్టణంలో కోతులు, పందులు, కుక్కల బెడద లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలి. ప్రభుత్వం కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలి. ఇంటి తలుపులు తేరిస్తే చాలు కోతులు ఇంట్లోకి ప్రవేశించి కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. ఒంటరిగా ఉన్న పిల్లల చేతుల్లోంచి తినుబండారాలను లాక్కెళ్తున్నాయి. శుక్రవారం నా కుమారుడు కుక్కకాటుకు గురయ్యాడు.

– చెనగాని మార్కెండయ్య, నకిరేకల్

ఆలయ అభివృద్ధికి కృషిచేస్తా



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

నాంపల్లి : మారుమూల ప్రాంతంలో ఉన్న రెండో యాదగిరిగుట్టగా పేరుగాంచిన చలిదోన లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని టీపీ గౌరారం గ్రామంలో శుక్రవారం శ్రీ చలిదోన లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. హోమం, రథోత్సవంలో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ఎండోమెంట్ ఈఓ జయరామయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి, పూల వెంకటయ్య, ఎరెడ్ల రఘుపతిరెడ్డి, రాజు, కృష్ణారెడ్డి, కొమ్ము భిక్షం, చిలుకూరి భిక్షం, నేతల్ల కొండల్, దండిగా నర్సింహ, భక్తులు పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

చండూరు(గట్టుప్పల్): గట్టుప్పల్ మండలం నామాపురం గ్రామంలో శుక్రవారం మహాలక్ష్మి నారాయణుల జాతర నిర్వహించారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఖబరస్తాన్‌కు దారి చూపాలని వినతి

మర్రిగూడ: మండల కేంద్రంలోని ముస్లింలు ఖబరస్తాన్‌కు వెళ్లే దారి కబ్జాకు గురైందని, ఆ బాటను స్వాధీనం చేసి దారి చూపాలని శుక్రవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని స్థానిక ముస్లింలు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే.. ఆర్డీఓ, తహసీల్దార్ స్థలాన్ని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తారని ముస్లింలకు హామీ ఇచ్చారు. అనంతరం మర్రిగూడ తహసీల్దార్ బక్క శ్రీనివాసులుకు ముస్లింలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, మాస చంద్రశేఖర్, కోఆప్షన్ మెంబర్ యాకుబ్‌అలీ, ఖదీర్, సలీం, జబ్బార్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

గిరి కుటుంబానికి అండగా ఉంటా

మర్రిగూడ మండలంలోని సరంపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకుడు సింగం గిరియాదవ్ కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గిరియాదవ్ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం గిరి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, వెన్నమనేని రవీందర్‌రావు, మేతరి యాదయ్య, ఏర్పుల శ్రీశైలం, మాస చంద్రశేఖర్, బీమానాయక్, వెంకటంపేట బాలయ్య, బేత వెంకటేష్‌యాదవ్ ఉన్నారు.

సమతుల్య ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ లావణ్యకుమారి

మర్రిగూడ: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సమతుల్య ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని చింతపల్లి సీడీపీఓ లావణ్యకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని ఖుదాబాక్షపల్లి, వెంకేపల్లి గ్రామపంచాయతీల్లో పోషణ పక్షంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బండకిందితండా, వెంకేపల్లి తండాల్లో తండావాసులకు చిరుధాన్యాలతో తయారు చేసే పౌష్టికాహారం గురించి వివరించారు. అంతకుముందు ఖుదాబాక్షపల్లిలో సీమంతాలు, అక్షరాభ్యాసం, పూర్వ ప్రాథమిక విద్య ఆవశ్యకత, చిరుధాన్యాల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మిర్యాల పద్మ, ఉపాధ్యాయులు రమేష్, ఏఎన్ఎంలు సునీత, కళావతి, అంగన్‌వాడీ టీచర్లు విఘ్నేశ్వరి, విజయలక్ష్మీ, సుగుణ, సులోచన, అలివేలు పాల్గొన్నారు.

రాములబండలో వైభవంగా రథోత్సవం



వేడుకల్లో పాల్గొన్న బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, తదితరులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నల్లగొండ రూరల్: నల్లగొండ మండలంలోని రాములబండలో శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సమీప గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్యలు రథోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి మాట్లాడుతూ తాను ఎన్జీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశానని, చిన్నప్పుడు ఈ ఆలయానికి నిత్యం వచ్చేవాడినని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, సాంబయ్య, అనిల్, లింగస్వామి, మునికుమార్, రాకీ, వెంకటేష్, రుక్మాగౌడ్, సాయి, భాస్కర్, మహేష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, ముత్తిరెడ్డి, పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నాగిరెడ్డి

నల్లగొండ రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను పారదర్శకంగా నిర్వహించాలని డీఆర్‌డీఓ నాగిరెడ్డి అన్నారు. నల్లగొండ మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 13వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నల్లగొండ మండలంలో ఈ ఆర్థిక సంవత్సరం రూ.6 కోట్ల 57 లక్షల విలువ గల పనులు నిర్వహించామన్నారు. అన్ని గ్రామాల్లో మొక్కల పెంపకంలో సిబ్బంది కొంత నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఎండిన మొక్కల స్థానంలో నూతనంగా మొక్కలు నాటాలని ఆదేశించారు. నీటి వనరుల పెంపు పనులపై ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. శాశ్వత పనులకు ప్రాధాన్యతనిచ్చి భావితరాలకు సహజ సంపదను అందించాలన్నారు. గ్రామాల వారీగా జరిగిన పనులను రికార్డుల ఆధారంగా పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ నవీన్, అంబుడ్స్‌మెన్ ఘోరి, క్లస్టర్ ఏపీడీ ఉపేందర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, ఏపీఓ జి. స్ఫూర్తి, ఫయాజ్, రమేష్, అనిత, లింగయ్య పాల్గొన్నారు.

కబ్జాకు గురైన ప్లాట్లు స్వాధీనం

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలో ఓ వ్యక్తి కబ్జా చేసిన ప్లాట్లను సొంతదారులు శుక్రవారం స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం పోలీసులకు కబ్జాదారుడిపై ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 301/ఆ 2008లో వీవీజీఎస్ పేరుతో కొందరు 182 ప్లాట్లు వెంచర్ చేసి పూర్తిగా విక్రయించారు. వెంచర్‌లో నైరుతి భాగంలో గుట్ట సమీపాన ఉన్న 32 ప్లాట్లను బండారు భిక్షపతి, వెంకన్న, సాయి, రవి, భూపాల్‌రెడ్డి, శ్రీహరి, ఈర్ల కృష్ణమూర్తితోపాటు మరికొందరు కొనుగోలు చేశారు. ఈ ప్లాట్ల పక్కన వెంచర్‌కు సంబంధించిన కొంత భూమిని చిట్యాలకు చెందిన అల్లె శ్రీహరి అనే వ్యక్తి చేవెళ్ల ఆర్డీఓ చింత వేణుమాధవ్‌కు విక్రయించాడు. వేణుమాధవ్ తన భార్య పేరుపై ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అయితే వేణుమాధవ్ కొనుగోలు చేసిన భూమితోపాటు పక్కనే ఉన్న 32 ప్లాట్లను కరోనా సమయంలో కబ్జా చేశాడు. కరోనా సమయంలో ప్లాట్ల యజమానులు ఆ వెంచర్ వైపు వెళ్లలేదు. అనంతరం తమ ప్లాట్లు కబ్జాకు గురయ్యాయని గ్రహించి అప్పటి ఎస్పీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఆనాటి నుంచి ఇప్పటి వరకు ప్లాట్ల సొంతదారులకు వేణుమాధవ్ ప్లాట్లను స్వాధీనం చేయలేదు. దీంతో ప్లాట్ల యజమానులు శుక్రవారం ప్లాట్ల వద్దకు చేరుకుని కబ్జాను తొలగించి హద్దులను ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం పోలీసులకు, సీఎంకు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. ప్లాట్ల సమీపాన గల ప్రభుత్వ స్థలాన్ని కూడా వేణుమాధవ్ ఆక్రమించుకున్నాడని, అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు అధికారులను కోరారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణ

మర్రిగూడ: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మర్రిగూడ, నాంపల్లి మండలాలకు చెందిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం శుక్రవారం మర్రిగూడ మండల కేంద్రంలో పర్యవేక్షించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎలాంటి అవరోధాలకు తావు లేకుండా చూసేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ కెమెరా ద్వారా రికార్డ్ చేస్తున్నట్లు స్క్వాడ్ సభ్యుడు యశ్వంత్ తెలిపారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ

నల్లగొండ : నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి అవకాశాల కోసం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, గ్రో ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో కంప్యూటర్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై రెండు నెలల పాటు శిక్షణనిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకురాలు అల్‌మస్ ఫర్వీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ఆపరేషన్, స్పోకెన్ ఇంగ్లిష్, సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, టైపింగ్, ఆప్టిట్యూడ్, సెక్టార్ రెడీనెస్, ఇంటర్వ్యూ స్కిల్స్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు అర్హత గల, వయసు 18 నుంచి 30 సంవత్సరాల లోపు వయస్సువారు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 7032649925, 9177785283 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రపంచ జల దినోత్సవం

చండూరు (గట్టుప్పల్): గట్టుప్పల్ మండల పరిధిలోని తేరేట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. జల ప్రాముఖ్యతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు లచ్చిరాంనాయక్, సాయిరాం, నర్సింహ, రాణి, మల్లేశం, వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు ఉషారాణి, ప్రమీల పాల్గొన్నారు.

కనులపండువగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

చిట్యాల: పిట్టంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, నకిరేకల్, నల్లగొండ మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఆలయ చైర్మన్ సామ రాంరెడ్డి, ఎంపీటీసీ దేవరపల్లి సత్తిరెడ్డి, వీసం బాబు, బండారు ప్రభాకర్‌రెడ్డి, కిరణ్ యాదవ్, కొమురెల్లి మోహన్‌రెడ్డి, నాతి శ్రీనివాస్‌గౌడ్, పైలా రఘుమారెడ్డి, సింగిరెడ్డి గోపిరెడ్డి పాల్గొన్నారు.

శాతవాహన చక్రవర్తి జయంతి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుమ్మర సంఘం ప్రతినిధులు

చిట్యాల: శాతవాహన చక్రవర్తి జయంతిని చిట్యాలలో భవాని కుమ్మర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాతవాహన చక్రవర్తి చిత్రపటానికి సంఘం అధ్యక్షుడు కంభంపాటి నర్సింహ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అర్రూరి సత్తయ్య, బొడ్డుపల్లి చంద్రశేఖర్, మిడిదొడ్డి శ్రీరాములు, ఉట్కూరి బాలకృష్ణ, బొడ్డుపల్లి లింగయ్య పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నల్లగొండ టౌన్ : పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణ కోసం పశువైద్య సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాలు వేసే కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నామని జిల్లా పశువైద్య సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ అంబటి యాదగిరి శుక్రవారం తెలిపారు. జిల్లాలో సుమారు 2లక్షల తెల్లపశువులు, 3.11 లక్ష నల్లజాతి పశువులకు టీకాలను వేయడానికి జిల్లా వ్యాప్తంగా 74 బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయా బృందాలు ఉదయం 7 గంటలకే గ్రామాలకు చేరుకుని మధ్యాహ్నం 12 గంటల వరకు టీకాలు వేస్తున్నారని పేర్కొన్నారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలోని పశువులు, గేదెలు ఉన్న రైతులంతా విధిగా టీకాలను వేయించి గాలి కుంటు వ్యాధి రాకుండా చూసుకోవాలని సూచించారు.

'కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అప్రజాస్వామికం'

నల్లగొండ రూరల్: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యారశ్రీను అన్నారు. శుక్రవారం నల్లగొండలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

శాలిగౌరారం: ఢిల్లీ సీఎం, ఆమ్‌ఆద్మీపార్టీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆమ్‌ఆద్మీ పార్టీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యంపల్ల పురుషోత్తంరెడ్డి అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు.

పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఆర్థికసాయం

శాలిగౌరారం: స్థానిక గ్రామపంచాయతీ పరిధిలోని బాలిశెట్టిగూడెంకు చెందిన నిరుపేదలు చిల్లంశెట్టి శోభ–శంకరయ్య దంపతుల కుమార్తె మహేశ్వరి వివాహానికి చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో చైత్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యంగలి రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మాజీ అధ్యక్షుడు బండపల్లి కొమరయ్య, లయన్స్ క్లబ్ ప్రతినిధి బుడిగె శ్రీనివాసులు, నాయకులు చింత ధనుంజయ్య, తొట్ల పుల్లయ్య, గణేశ్, శ్రీనివాస్, యుగంధర్, సాయిగణేశ్, నగేశ్, నాగార్జున్, సతీష్, మహేశ్, కృష్ణంరాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

హౌజింగ్ బోర్డు కాలనీలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో శుక్రవారం సాయంత్రం హౌజింగ్ బోర్డు కాలనీ యూత్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో యూత్ కమిటీ సభ్యులు ఎండీ. సజ్జత్, నదీమ్, ఎస్‌కె. జహంగీర్‌బాబ, ఆర్ఫాత్, సల్మాన్, ఫసీ, వజ్జు, ఆయాజ్, ఆజామ్, మన్సూర్‌అలీ, వాజీద్, వార్డు కౌన్సిలర్ నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

26న శ్రీ కనకదుర్గ ఆలయ వార్షికోత్సవం

చిట్యాల: పట్టణంలోని శ్రీ కనకదుర్గ ఆలయ 21వ వార్షికోత్సవాన్ని ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులుగౌడ్ తెలిపారు. వార్షికోత్సవానికి సంబంధించిన ప్రచార కరపత్రాలను శుక్రవారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో అర్చకులు వినయ్‌మోహన్‌శర్మ, గోవిందు మిశ్రా, ఆలయ మేనేజర్ అంబటి నాగిరెడ్డి, డైరెక్టర్లు బుద్ద విమల, గంజి వెంకటేశం, వరకాంతం నర్సిరెడ్డి, రుద్రారపు లింగయ్య, జిట్ట సాయిలు, వనమా నిఖిల్‌కుమార్ పాల్గొన్నారు.

బూర నర్సయ్యగౌడ్ గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

నకిరేకల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ గెలుపునకు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, పార్లమెంట్ ప్రబారి పాపారావు పిలుపునిచ్చారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. బీజేపీ నకిరేకల్ అసెంబ్లీ కన్వీనర్ మైల నర్సింహ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్లమెంట్ క్లస్టర్ కో కన్వీనర్ బందారపు లింగస్వామి, నాయకులు రూపని లింగస్వామి, నకిరేకంటి మెగిలయ్య, గోలి ప్రభాకర్,, మండల వెంకన్న, పల్స శ్రీను, యానాల శ్రీనివాస్‌రెడ్డి, గర్రె మురళి, అయితగోని అనిత, చికిలంమెట్ల అశోక్, అఖిల్ మీర్జా, తదితరులు పాల్గొన్నారు.

దుండగులను అరెస్ట్ చేయాలి

మర్రిగూడ: మేడ్చల్ మల్కాజ్‌గిరిలోని జ్యోతినగర్ దోభీఘాట్‌లో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని రజక సంఘం జిల్లా నాయకుడు వెంకటంపేట బాలయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట పగడాల పరమేష్, పగడాల గిరి తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కట్టంగూర్ : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాధా ఫౌండేషన్ చైర్మన్ వల్లూరిపల్లి రాధమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని ఈదులూరు గ్రామంలో రాధా ఫౌండేషన్ సహకారంతో కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ వైద్యశిబిరంలో జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, పిడియాట్రిషన్, గైనకాలజీ, డెంటల్, కంటి సంబంధిత వ్యాధులకు సుమారు 40 మంది వైద్యులు 800 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కామినేని హాస్పిటల్ మార్కెటింగ్ గ్రూప్ హెడ్ కె సత్యనారాయణ, వైద్యులు, పీఆర్‌ఓ కిరణ్ పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు